అప్రమత్తతతోనే ఆనందకేళి

- అశ్రద్ధతో కళ్లకు ముప్పు..
- జాగ్రత్తలు అవసరం..

సత్తుపల్లిటౌన్: దీపావళి పండుగలో ఆనందం ఎంత ఉంటుందో.. ప్రమాదం కూడా అంతే ఉంటుంది. బాణాసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు అవసరం.. టపాసులు కాల్చుతూ సిరులు కురిపించాలని లక్ష్మీదేవిని పూజించటం బొమ్మలు కొలువులు నిర్వహిస్తూ ఇంటిల్లపాది ఆనందోత్సాహాలతో జరుపుకునే దివ్వెల పండుగే దీపావళి. గురువారం దీపావళి పర్వదినాన్ని ఇంటింటా జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. పిండి వంటలతో నోటిని తీపి చేస్తూ టపాసులు కాల్చుతూ అందరు ఉత్సాహంగా ఈ వెలుగుల పండుగను జరుపుకోవటం సాంప్రదాయం. పిల్లల నుంచి పెద్దల వరకు ఎంతో ఇష్టంగా దీపావళికి తారాజువ్వలు, చిచ్చుబుడ్లు, భూ చక్రాల వెలుగులతో సంతోషంగా జరుపుకునే ఈ పండుగలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన జీవితమే చీకటిమయం అవుతుంది. తగు జాగ్రత్తలు పాటిస్తూ వేడుకలు జరుపుకోవాలని పోలీసులు, వైద్యులు సూచిస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

ముఖ్యంగా గ్యాస్ సిలిండర్లు, ఆయిల్ క్యాన్లు తదితర మండే పదార్థాలకు బాణాసంచా సామగ్రి దూరంగా పెట్టాలి.

- అధికృత తయారీదారుల నుంచి మాత్రమే బాణాసంచా కొనుగోలు చేయాలి. తర్వాత కొన్ని గంటలు ఎండలో ఉంచాలి.
- పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు నిశితంగా పరిశీలించాలి.
- అందరు గుమ్మిగూడి కాల్చవద్దు. పొడవాటి క్యాండిల్స్, అగరవత్తులను మాత్రమే వాడి బాణాసంచా కాల్చాలి. ఆ సమయంలో కళ్లకు గాగుల్స్ ధరించటం వల్ల రవ్వలు పడకుండా చూసుకోవచ్చు.
- ఇంట్లో మేడపైన కాల్చడానికి ప్రయత్నించవద్దు. బహిరంగ ప్రదేశాలు, ఆరుబయట మాత్రమే ఎంచుకోవాలి.
- కాలిన గాయాలపై పోయడానికి లేదంటే మంటలు ఆర్పేందుకు రెండు బకెట్ల నీళ్లు సమీపంలో పెట్టుకోవాలి.

ఇవి తప్పనిసరి..

- కాకరపూవత్తులు కాల్చిన తర్వాత వాటి కడ్డీలు చల్లారే వరకు ఒక చోటపెట్టి తీసివేయాలి.
- బాణ సంచా కాల్చేటప్పుడు వాటిపై ఒంగిపోవటం సరికాదు. దూరం నుంచి అంటించాలి.
- సీసా, టిన్‌డబ్బా, కుండలు తదితరవాటిపై పెట్టి కాల్చకూడదు. దీంతో కళ్లు, శరీరానికి గాయాలు తగిలే ప్రమాదం ఉంది.
- ఒకసారి అంటించిన తర్వాత వెలగలేదని చూసేందుకు వెంటనే దగ్గరకు వెళ్లవద్దు. కొన్నిసార్లు పేలే ప్రమాదం ఉంటుంది.
- కాల్చే సమయంలో మందపాటి కాటన్ దుస్తులు వేసుకోవాలి. అంటించిన కొవ్వత్తులు, దీపపు ప్రమిదలు, అగరత్తులు టపాసులకు దూరంగా ఉంచాలి.
- దుస్తులు శరీరానికి పట్టినట్లు ఉండాలి. వదులుగా ఉంటే దస్తులు వల్ల అంటుకునే అవకాశం ఉంది. కళ్లల్లో టపాసుల అవశేషాలు గుచ్చుకుంటే తీసే ప్రయత్నం చేయవద్దు. అలానే అస్పత్రికి తరలించాలి.
- ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా తారాజువ్వలు, పూరి గుడిశెలు, ఇళ్లు, గడ్డివాములపైకి దూసుకెళ్లి అగ్నిప్రమాదాలు సంభవిస్తాయి.
- మహిళలు చీరలు ధరించినప్పుడు పైట కొంగును నడుముకు బిగించాలి. చుడీదారులు వేసుకునే వారు వదులుగా ఉన్నవి కాకుండా బిగుతుగా ఉండేవి వేసుకోవాలి.
- పసిపిల్లలను బాణాసంచా కాల్చే ప్రాంతానికి దూరంగా ఉంచాలి. పర్యావరణ హితమైన గ్రీన్ క్రాకర్స్ వాడితే మంచిది.
- టపాసులు కాల్చినప్పుడు దుస్తులకు అంటుకుంటే వెంటనే నేలపై అటూ.. ఇటూ దొర్లాలి. నీరు, ఇసుక, ప్రాథమిక చికిత్స ఔషధాలు అందుబాటులో ఉంచుకోవటం మంచిది. ఏదైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలి.
- బాంబులు కాల్చేటప్పుడు ఇంటి ముందు బకెట్లో నీటిని సిద్ధంగా పెట్టుకోవాలి.



చిచ్చుబుడ్డి వెలుగుల్లో ఆనందంగా..

దీపావళి టపాసుల అమ్మకాలు



వైరాలో ఏర్పాటైన దుకాణాలు

వైరా: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని వైరా నియోజకవర్గ కేంద్రంలో వ్యాపారులు భారీ ఎత్తున దీపావళి టపాసుల దుకాణాల ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 10 దుకాణాలను పోలీసుల అనుమతితో ఏర్పాటు చేశారు. ధరలు విపరీతంగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..



బాణసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి. కళ్లకు రక్షణ పరికరాలు ధరించటం మంచిది. చేతులతో పట్టుకొని టపాసులను పేల్చటం ప్రమాదకరం. భారీ బాణాసంచా కాల్చటం వల్ల పొగతో శ్వాసకోశ సమస్యలు, వినికిడి ఇబ్బందులు వస్తాయి. ఏమైనా ప్రమాదం జరిగితే వెంటనే ఆస్పత్రిలో తక్షణం వైద్య చికిత్స అందించాలి.

– కట్టా శివాజీ, నేత్ర వైద్యాధికారి, సత్తుపల్లి

అశ్రద్ధ వహించొద్దు..



బాణసంచా కాల్చేటప్పుడు ఏమాత్రం అశ్రద్ధ వహించవద్దు. దీపావళి టపాసులు కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ ఉండాలి. అన్ని జాగ్రత్తలు తీసుకొని టపాసులు కాల్చాలి. ప్రమాదాల భారిన పడకుండా ఆనందంగా జరుపుకోవాలి.

– ఏ.రఘు, ఏసీపీ, సత్తుపల్లి

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వేంసూరు/ సత్తుపల్లిరూరల్/ కల్లూరురూరల్/ ముదిగొండ: రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆ పార్టీ నాయకుడు మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. వేంసూరులో, సత్తుపల్లిలోని రేజర్లలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను దయానంద్, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు ప్రారంభించారు. అదే విధంగా కల్లూరురూరల్ మండలంలోని బత్తులపల్లి, లక్ష్మీపురం గ్రామ పంచాయతీల పరిధిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి ప్రారంభించారు. ముదిగొండ మండలంలోని యడవల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి ప్రారంభించగా.. కారేపల్లిలోని ఐకేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కారేపల్లి మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్‌ను పొందాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సొసైటీ చైర్మన్లు గోపాలకృష్ణ, నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, ఏఓలు వై.శ్రీనివాసరావు, ఎం.రూప, ఐకేపీ ఏపీఎంలు సుబ్బారావు, వెంకటరామారావు, తహసీల్దార్లు పులి సాంబశివుడు, ఎం.సంపత్‌కుమార్, ఎంపీడీఓలు దాసరి చంద్రశేఖర్, సురేందర్, ఎంపీఓ వాల్మీకి కిషోర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్: రేజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న మరియదాసు

చింతకాని: అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీఎస్టీ విజిలెన్స్ ఖమ్మం డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ పాకలపాటి మరియదాసు తెలిపారు. బుధవారం మండలంలోని రామకృష్ణాపురంలో అవినీతి నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ అభివృద్ధికి ఆర్థిక, రాజకీయ, సామాజిక అవినీతి అడ్డంకిగా మారుతుందన్నారు. అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రతిజ్ఞ చేయించారు. ఏదైనా అవినీతి సంఘటన జరిగితే తగిన ఏజెన్సీకి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జీఎస్టీ సూపరింటెండెంట్ నూతనకుమార్, అధికారులు విజయ్‌పాల్, శేషగిరిరావు, అలోక్ కుమార్, పుల్లారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నల్లగట్ల మురళీ, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక అభివృద్ధిని మెరుగుపర్చుకోవాలి

వైరా: విద్యార్థినీ, విద్యార్థులు సాంకేతిక అభివృద్ధిని మెరుగుపర్చుకోవాలని మధు విద్యాలయం కరస్పాండెంట్ మల్లెంపాటి రంజిత్ అన్నారు. బుధవారం స్థానిక మధు విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి వీరభద్రం జ్యోతి ప్రజ్వలన చేసి స్టూడెంట్ లీడ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన గణిత, సైన్స్ నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కార్యదర్శి మల్లెంపాటి రంజిత్, కోశాధికారి నర్మద, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాంబాబు, సీబీఎస్ఈ ప్రిన్సిపల్ డీవీఆర్ చారీ, రాజేంద్రప్రసాద్, సౌజన్య, అత్వన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితికి కృతజ్ఞతలు

మధిర: అనారోగ్యంతో కాలు తొలగించిన బాధితురాలికి హైదరాబాద్‌లో జైపూర్ కాలు అమర్చేందుకు కృషి చేసిన శ్రీ సత్యసాయి సేవా సమితి వారికి కృతజ్ఞతలు తెలిపారు. మధిర పట్టణానికి చెందిన మంగళగిరి లక్ష్మికి ఇటీవల అనారోగ్యంతో కాలు పూర్తిగా తొలగించారు. ఆమెకు హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర శ్రీ సత్య సాయి రాష్ట్ర ఆర్గనైజేషన్ వారు నిర్వహించిన మెడికల్ క్యాంపులో జైపూర్ కాలుని అమర్చారు. కార్యక్రమంలో కోనా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి..

ముదిగొండ: ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముదిగొండ మండల ఐద్వా మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మందరపు పద్మ, కోలేటి అరుణ తెలిపారు. బుధవారం ముదిగొండలోని తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామిలకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు, కందుల సుజాత, రేణుక, దేవి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న కృష్ణ

కొణిజర్ల: రాష్ట్రంలో అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు డిమాండ్ చేశారు. బుధవారం కొణిజర్ల సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో అర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, దళిత వాడలకు శ్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం భూమి కేటాయించాలన్నారు. మండల మహాసభ జయప్రదం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బోయినపల్లి శ్రీనివాసరావు, చింతపల్లి ప్రసాద్, పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



వేదశ్రీని అభినందిస్తున్న వీరభద్రం

వైరా: ఈ నెల 29న సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్–19 టోర్నమెంట్ బాలికల విభాగంలో మధు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్న వాసిరెడ్డి వేదశ్రీ మొదటిస్థానం సాధించి మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో జరిగే టోర్నమెంట్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరఫున అర్హత సాధించింది. దీంతో వేదశ్రీని మధు విద్యాసంస్థల చైర్మన్ వీరభద్రంతో పాటు.. మల్లెంపాటి ప్రసాద్‌రావు, మల్లెంపాటి రంజిత్, నర్మిదా, రాంబాబు, చారీ తదితరులు విద్యార్థినిని అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

సత్తుపల్లిరూరల్: మండలంలోని సత్తుపల్లి డాక్టర్ కేకేఆర్ పాఠశాల విద్యార్థి టి.విజివల్ సాయి గౌరవ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. అంతే కాక నవంబర్‌లో హైదరాబాద్‌లోని నాంపల్లిలో నిర్వహించే వరల్డ్ చాంపియన్ షిప్ పోటీలకు కూడా ఎంపికయ్యాడు. దీంతో విద్యార్థిని కరాటే మాస్టర్ బాలకృష్ణతో పాటుగా పాఠశాల డైరెక్టర్ హరీష్, ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

నియామకం..



అబ్దుల్ హబీబ్

కల్లూరు: కల్లూరు పట్టణానికి చెందిన అబ్దుల్ హబీబ్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఫోరం రాష్ట్ర చైర్మన్ నియామక పత్రం అందజేశారు. తాను చేసిన ఉద్యమ సేవలను గుర్తించి తనపై నమ్మకంతో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకు హబీబ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను ఆపాలి

పెనుబల్లి: రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి వ్యతిరేకంగా ఉన్న ఎస్సీ వర్గీకరణను ఆపాలని మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి మేకతొట్టి కాంతయ్య, జిల్లా అధ్యక్షుడు ముల్లంగి కాంతారావు డిమాండ్ చేశారు. మాల కులాల సంక్షేమ సేవా భవనం నిర్మాణం చేపట్టాలని తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి, ఎస్సీ వర్గీకరణ మంత్రిత్వ ఉప సంఘం చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డికి పంపామని ఆయన తెలిపారు.

‘మిస్ట్’లో ముగిసిన వర్క్‌షాప్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులకు గత మూడురోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ, సాయిపవన్, డీన్ జాకీర్‌హుస్సేన్, ఎం.వి.రామచంద్రరావు, మారేశ్వరరావు, రాజా, జాకబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

కారేపల్లి: నవంబర్ 3న ఖమ్మంలోని చెరుకూరి మామిడి తోటలో జరిగే టీఎన్జీఓల వనమహోత్సవానికి అందరూ తరలిరావాలని కోరుతూ.. వాల్ పోస్టర్లను సింగరేణి తహసీల్దార్ సంపత్ కుమార్, ఎంపీడీఓ సురేందర్‌లు బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రవీంద్రప్రసాద్, గ్రామ కార్యదర్శులు కొండపల్లి అనీల్ కుమార్, నెహ్రూ, నాగలక్ష్మి, నాగేశ్వరరావు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులు, చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మణి

వైరారూరల్: మానవ హక్కులు, మహిళ చట్టాలపై హ్యూమన్‌రైట్స్ సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదూరి మణి అన్నారు. బుధవారం మండలంలోని ఖానాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బహుజన అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో బహుజన అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపకుడు ఆదూరి ఆనందం, అంగన్‌డీ సూపర్ వైజర్ జాన్‌బీ, టీచర్లు పాల్గొన్నారు.

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

తల్లాడ: వరంగల్ – దేవరపల్లి జాతీయ రహదారిలో తల్లాడ వద్ద ప్రమాదకరంగా ఉన్నాయని, వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు సత్తెనపల్లి నరేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పరిపాలనలో రోడ్లు అధ్వానంగా మారాయని.. డివైడర్లు పగిలిపోయాయన్నారు. స్పీడ్ బ్రేకర్లు, సిగల్స్ లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారీన పడుతున్నారన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

- వైభవంగా పడిపూజ
- ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని జేవీఆర్ పార్కు ఎదురుగా గల శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి దేవాలయం 9వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష్మీగణపతి హోమం, విశ్వేశ్వరుడికి అభిషేకం, అయ్యప్పస్వామికి విశేష పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని పూజలు చేశారు. ఆలయంలో నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఏసీపీ అనిశెట్టి రఘు ప్రారంభించారు. అనంతరం పదునెట్టాంబడి మహాపడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ మహేష్, మధుసూదన్‌రావు, శ్రీనివాసరావు, ఉమా, సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

సింగరేణి ఉద్యోగికి..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి సింగరేణి గెస్ట్‌హౌస్‌లో కుక్‌గా పనిచేస్తున్న నాగరాజు గత కొంతకాలంగా గాల్‌బ్లాడెర్‌లో స్టోన్స్ సమస్యతో బాధపడుతుండటంతో జీఎం షాలేంరాజు చొరవతో ఉద్యోగులు రూ.41వేలు వితరణ చేశారు. ఈ నగదును జీఎం చేతుల మీదుగా బుధవారం నాగరాజుకు అందించారు. కార్యక్రమంలో పీఓలు నర్సింహారావు, ప్రహ్లాద్, ఉద్యోగులు రామకృష్ణ, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థినికి ఆర్థిక సాయం ..



నగదు అందజేస్తున్న దృశ్యం

మధిర: ఎంబీబీఎస్ సీటు సాధించి పేదరికంతో వైద్య విద్యను అభ్యసించేందుకు ఇబ్బంది పడుతున్న నిరుపేద విద్యార్థిని పానెం శ్రీహర్షితకు టీఎస్‌ఆర్‌టీసీ మధిర డిపో మేనేజర్ ఆధ్వర్యంలో బుధవారం రూ.12వేలు నగదు అందజేశారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని దిద్దుపూడి గ్రామానికి చెందిన కొనకంచి జోజి ప్రకాశమ్మ దంపతుల మనవరాలు శ్రీహర్షిత తన చిన్నప్పుడే తల్లిని కోల్పోయింది. ఆ తర్వాత తండ్రి ఆదరణ దక్కలేదు. నీట్‌లో రాష్ట్రస్థాయిలో 4,530 ర్యాంకు సాధించి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు దక్కించుకున్న శ్రీహర్షితకు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా శ్రీ హర్షిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నోట్ పుస్తకాలు పంపిణీ..

తల్లాడ: స్థానిక బాలభారతి విద్యాలయంలో బుధవారం ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి పదో తరగతి విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. జవహర్‌లాల్ మంచ్ సంఘం తరఫున అందించిన పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం బాలభారతి విద్యార్థులచే తయారు చేయబడిన వివిధ క్రాఫ్ట్ వర్క్ తోరణాలు, దీపాలను చూసి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, కేఎస్ఎం ప్రిన్సిపాల్ రామారావు, ఏఓ శశాంక్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో..

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం జవహర్‌బాల మంచ్ సంస్థ వారిచే పంపిణీ చేసిన నోట్‌పుస్తకాలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ చేతుల మీదుగా విద్యార్థినులకు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సంధ్యారాణి, అజయ్, సౌజన్య పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు..

తల్లాడ: బహుజన సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గొల్లగూడెంలో నిరుపేదలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో బహుజన సేవా సంస్థ అధ్యక్షులు మోదుగ బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు వీరారెడ్డి, లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రమౌళి

తల్లాడ: బాల్య వివాహాలను అరికట్టాలని తల్లాడ ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. తల్లాడ గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. 21 సంవత్సరాలు అబ్బాయిలకు, 18 సంవత్సరాలు అమ్మాయిలకు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కె.శ్రీదేవి, తల్లాడ గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణారావు, ఏపీఓ కోటయ్య, పారా లీగల్ వాలంటీర్ గొల్లమందల పద్మ పాల్గొన్నారు.

ఎన్నెస్పీ కాల్వలోకి దూసుకెళ్లిన లారీ

పెనుబల్లి: మండలంలోని వీఎం.బంజర్ శివారు ఎన్నెస్పీ బ్రిడ్జి మీదుగా వెళ్తున్న భారీ లారీ కాల్వలోకి దూసుకెళ్లింది. గుజరాత్ రాష్ట్రానికి 40 టన్నుల ఐరన్ లోడుతో వెళ్తున్న 24టైర్ల లారీ అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లగా డ్రైవర్ నాగిజ్జి సురక్షితంగా బయటపడ్డాడు. వర్షం కురుస్తున్న సమయాన కాల్వపై మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమాన అదుపు తప్పి ఈ ఘటన జరిగిందని డ్రైవర్ తెలిపాడు. ఈమేరకు బ్రిడ్జి రక్షణ గోడలు, కేబుల్ పైపులు ధ్వంసం కావడంతో వీఎం బంజర్ పోలీసులు విచారణ చేపట్టారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

మధిర: డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన భరత్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థులను బుధవారం భరత్ విద్యాసంస్థల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భరత్ విద్యా సంస్థల అధినేత, మధిర మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత, వెంకటరెడ్డి దంపతులు మాట్లాడుతూ.. శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీ బానిస అవుతుందన్నారు. కార్యక్రమంలో మధిర మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, మున్సిపల్ మేనేజర్ ఉదయ్ కుమార్, ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, ఉమ, నాగరాజు, అజీమ్, పాషా, భవాని, శశికళ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు..



ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో సుమారు 35 సంవత్సరాల పాటు సింగరేణి సంస్థలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటరమణ, అంజిబాబులను ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ రామారావు, తీగల క్రాంతికుమార్, చెన్నకేశవరావు, ప్రకాష్, సమయ పాల్గొన్నారు.

నర్సిరెడ్డికి మద్దతు తెలపండి

మధిర: ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించుకుందామని టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి తెలిపారు. ప్రజాప్రతినిధిగా సాధారణ జీవితం గడుపుతూ మాటల్లో, ప్రవర్తనలో, నిబద్ధత, నిజాయతీ కలిగిన ఉన్నత వ్యక్తి నర్సిరెడ్డి అని తెలిపారు. ఆయన విజయాన్ని కాంక్షిస్తూ మధిర పట్టణం, మండలంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో, గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వీరయ్య, రామకృష్ణ, ఇబ్రహీం, చెన్నయ్య, లాల్ అహ్మద్, భాస్కర్‌రావు, మహేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

తల్లాడ: రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు మద్దతు ధర ఇవ్వాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం తల్లాడలోని ప్రైవేట్, మరియు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలను బీజేపీ ఆధ్వర్యంలో పరిశీలించారు. కొనుగోలు దారులు రైతుల కిస్తున్న ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీఐ కేంద్రంలో తేమ శాతం పేరుతో పత్తి కొనుగోలు చేయకపోవడంతో పక్కనే ఉన్న ప్రైవేట్ వ్యాపారులు రూ.5వేల నుంచి రూ.5,500లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. మార్కెట్లో పత్తిరైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామరావు, కార్యదర్శి కృష్ణారావు, కిరణ్, నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.